# 'విక్టోరియా'లో వాదులాట!

**'నమస్తే' కథనంతో కంగుతిన్న అధికారులు**

**'నాకేం తెలియద'ంటూనే పరస్పర నిందలు**

హుటాహుటిన 'హోం'కు పూర్వ స్టోర్‌కీపర్

సిబ్బందిని పిలిచి ప్రత్యేకంగా ఆరా..

విచారణకు సిద్ధమైన ఉన్నతాధికారులు

నిజాం సంపదపై నిగ్గుతేల్చాలని నిర్ణయం



హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): 'విక్టోరియా మెమోరియల్ హోం' లోని నిజాం సంపద విషయంలో 'నాకు సంబంధం లేదంటే నాకు సంబంధం లేదు' అని అధికారులు కీచులాడుకుంటున్నారు. ఎవరికివారే పరస్పర ఆరోపణలకు దిగుతున్నారు. హోంలోని విలువైన నిజాం సంపద పక్కదారి పడుతున్నదని పలువురు పూర్వ విద్యార్థులు ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 'విక్టోరియా హోంలో నయా రూల్' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం ప్రత్యేక కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనంతో హోం అధికారులు ఒక్కసారిగా కంగుతిన్నారు. 'దొంగెవరంటే భుజం తడుముకున్నట్టు'గా నాకేం సంబంధం లేదంటూనే ఒకరిపై ఒకరు నిందలు వేసుకున్నట్టు తెలిసింది.

### ఆగమేఘాలపై హోంకు..

విక్టోరియా మెమోరియల్ హోం గ్రేడ్ 2-బీ వారసత్వ హోదా కింద ఉన్నది. హోమ్‌లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్, పింగాణి, తదితర విలువైన వస్తువులు లాకర్స్‌లో ఉన్నాయి. ఆ వివరాలను గత సూపరింటెండెంట్ రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఉద్యోగ విరమణ సందర్భంగా రిజిస్టర్‌ను ప్రస్తుత సూపరింటెండెంట్‌కు అప్పగించారు. లాకర్స్‌లోని సంపదను చాలామటుకు బయటకు తరలించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై 'నమస్తే'లో కథనం ప్రచురితమైన వెంటనే సదరు పూర్వ సూపరింటెండెంట్ హుటాహుటిన హోమ్‌కు చేరుకున్నారని తెలిసింది. ప్రస్తుత సూపరింటెండెంట్ సెలవులో ఉండడంతో ఇతర సిబ్బందితో ఇదే విషయమై ఆరా తీసినట్టు సమాచారం. తాను ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా రిజిస్టర్‌ను ప్రస్తుత సూపరింటెండెంట్‌కు అప్పగించినట్టు పూర్వ సూపరింటెండెంట్ చెబుతుండగా, తనకు అప్పగించలేదని, హోంలో ఉన్న వొకేషనల్ కోర్సు ఇన్‌స్ట్రక్టర్‌కు ఆ రిజిస్టర్ అప్పగించారని ప్రస్తుత సూపరింటెండెంట్ చెప్పినట్టు సమాచారం. వొకేషనల్ కోర్సు ఇన్‌స్ట్రక్టర్ కూడా రిజిస్టర్‌తో తనకేం సంబంధం లేదని, తనకు అప్పగించలేదని చేతులెత్తేసినట్టు తెలిసింది. ఈ విషయంపై పూర్వ, ప్రస్తుత సూపరింటెండెంట్లు, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ మధ్య ఫోన్‌లోనే వాదోపవాదాలు జరిగినట్టు విశ్వసనీయ సమాచారం. హోం సంపదను కాపాడాల్సింది పోయి ఎవరికి వారు తమకేం సంబంధం లేదని తప్పించుకుంటుండడంతో పూర్వ విద్యార్థుల ఆరోపణలకు బలం చేకూరుతున్నది. లాకర్స్‌లో అసలు నిజాం సంపద ఉన్నదా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### లాకర్‌ను తెరిచేందుకు నిర్ణయం..!

'నమస్తే' కథనాన్ని సీరియస్‌గా తీసుకున్న హోమ్ ఉన్నతాధికారులు, కమిషనర్ ఆదేశాలతో పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు సిద్ధమమైనట్టు సమాచారం. లాకర్‌ను తెరిచి స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న వస్తువులు ఉన్నాయో? లేవో? తనిఖీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. నిజాం సంపదను వెలికి తీసి భద్రపరచాలని యోచిస్తున్నట్లు హోం వర్గాలు వెల్లడిస్తున్నాయి.

### కబ్జాలకు అడ్డుగా ఉన్నామనే..

*విక్టోరియా హోమ్ ఆస్తులను కాపాడుతూ కబ్జాలకు అడ్డుగా ఉండడం గిట్టని కొందరు పూర్వ విద్యార్థులు పనిగట్టుకుని ఫిర్యాదులు చేస్తున్నారని హోమ్‌కు చెందిన అలినేని నర్సింహరాములు, రాము, మహేశ్, నగేశ్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 35ఏండ్లుగా హోం ఆస్తులను తాము, ప్రస్తుత సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి సహకారంతో సంరక్షిస్తున్నామని వివరించారు. ఇది గిట్టని వారే సూపరింటెండెంట్‌పై ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. సంస్థ ఆస్తులను కబ్జా చేయాలనే కుట్రలో భాగంగానే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. హోమ్‌కు నిజమైన పూర్వ విద్యార్థులం తామేనని, ఇక్కడ జరుగుతున్న అన్ని కార్యకలాపాలపై తమకు అవగాహన ఉన్నదని, ఇకనైనా ఆరోపణలు మానుకోవాలని ప్రకటనలో వెల్లడించారు.*

# కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి

మొయినాబాద్, మే 5: పంటకు నీళ్లు పెట్టడానికి వెళ్లిన ఓ కౌలు రైతు విద్యుత్తు షాక్‌తో మృతిచెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి చెందిన కంచె కృష్ణ (40), అతని కుమారుడు జశ్వంత్ ఇద్దరు కలిసి జీవనోపాధి కోసం గ్రామానికి చెందిన గూడూరి వితలయ్య పొలాన్ని కౌలుకు తీసుకొని వరి



కంచె కృష్ణ (ఫైల్)

పంట వేశారు. వరికి నీళ్లు పెట్టడానికి ఆదివారం ఉదయం కృష్ణ పొలం వద్దకు వెళ్లి స్టార్టర్ వద్ద బోరు మోటర్ ఆన్ చేయడానికి ప్రయత్నిస్తుండగా కరెంట్ షాక్ తగలి కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికంగా ఓ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్లలోని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.




నెక్లెస్‌రోడ్డులో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సైక్లిస్టులు

# ఓటు హక్కుపై సైక్లిస్టుల అవగాహన ర్యాలీ

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ) : ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సైక్లిస్టులు పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్ (హెచ్‌సీజీ) ఆధ్వర్యంలో సైక్లిస్టులు ఆదివారం కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి సచివాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌సీజీ ఫౌండర్ నందనూరి రవీందర్ మాట్లాడుతూ.. ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉన్నదని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలని కోరారు. ప్రతి పౌరుడికి ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని చెప్పారు. ఓటును అమ్ముకోవడం చేయకూడదని కోరారు.

# చీడలను విశ్లేషించే యాప్

- **ప్లాంటిక్స్‌తో కలిసి ఇక్రిశాట్ సృష్టి**
- **వ్యవసాయ సమస్యలకు సత్వర పరిష్కారాలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు ఆధునిక సాంకేతికత సాయంతో ఇక్రిశాట్ ఎప్పటికప్పుడు పరిష్కారాలను చూపుతున్నది. అందులో భాగంగా భూసారంతోపాటు పంటలకు సోకే తెగుళ్లు, క్రిమికీటకాలను గుర్తించి, రైతులకు సత్వర పరిష్కారాలను అందించేందుకు ప్లాంటిక్స్‌తో కలిసి ఓ మొబైల్ యాప్‌ను తయారు చేసింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీతో పని చేసే ఈ యాప్ రైతులకు గొప్ప వరంగా మారింది. దీన్ని ఉపయోగించి పంటను ఫొటో తీయగానే దానికి సోకిన చీడను విశ్లేషించి, నియంత్రణకు శాస్త్రీయ సూచనలను అందిస్తున్నది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల మంది ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారని, గత పదేండ్లలో ఈ యాప్ 10 కోట్లకుపైగా ఫొటోలను విశ్లేషించి వ్యవసాయ సమస్యలకు పరిష్కారాలను అందించిందని ఇక్రిశాట్ వెల్లడించింది. ఇటీవల ఈ యాప్ వినియోగం మరింత పెరగడంతో రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించే కరదీపికలా తీర్చిదిద్దారు. పంటలకు సంబంధించిన 700 రకాల వ్యాధులను విశ్లేషించగలిగే ఈ యాప్ ప్రస్తుతానికి 20 భాషల్లో సేవలు అందిస్తున్నట్టు ఇక్రిశాట్ తెలిపింది.



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆదివారం వీచిన బలమైన ఈదురుగాలులకు కూలిన కోళ్ల ఫారం షెడ్డు



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ షీట్ల పై నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

# ఐదు రోజులు వర్షసూచన

- **రాష్ర్టానికి చల్లటి కబురు**
- **వివిధ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు**
- **ఆదివారం కొనసాగిన అధిక ఉష్ణోగ్రతలు**
- **వెల్గటూర్‌లో 47.1 డిగ్రీల అత్యధికం**
- **హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**
- **వడదెబ్బ కు ఒక్కరోజే 19 మంది మృతి**

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనాలకు వాతావరణశాఖ చల్లటి కబురు చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఐదురోజుల పాటు వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఈ మేరకు వివిధ జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు పలు ప్రాంతాల్లో వడగాలులు కొనసాగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. దాంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసింది. సోమవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ , వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. మంగళవారం సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. బుధవారం నుంచి గురువారం వరకు పలు చోట్ల భారీ, మరికొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది.

### గాలివాన బీభత్సం

- **ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లో పలుచోట్ల వర్షం**
- **పిడుగుపాటుకు ముగ్గురు వ్యక్తులు సహా 11 పశువులు మృతి**

నమస్తే నెట్‌వర్క్, మే 5: ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఆదివారం పలు చోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన జనాన్ని అతలాకుతలం చేసింది. పిడుగుపాటుకు ముగ్గురు మృత్యువాత పడ్డారు. విద్యుత్తు స్తంభాలు నెలకొరిగి అంతరాయం ఏర్పడింది. ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల ధాన్యం తడిసింది. మామిడి తోటల్లో కాయలు నేలరాలి రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయిపల్లి, క్రాస్ రోడ్డు, తాళ్లగడ్డలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వడగండ్ల వాన కురిసింది. మండల కేంద్రానికి చెందిన రైతు బాస బుల్లయ్య మిర్చి కల్లం వద్దకు వెళ్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మంగపేట మండలంలో భారీ వర్షం కురిసింది. తాడ్వాయి మండలంలోని దామరవాయిలో చేతికొచ్చిన వరి పంటలు నేలకొరిగాయి. కాటాపురం, మంగపేట దారిలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో ఆరబోసిన మక్కజొన్న, ధాన్యం తడిశాయి. నర్సింహులపేట మండలంలో మంగిమడుగులో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసి ముద్దయింది. రామన్నగూడెం, ముంగిమడుగు, ఫకీరు తండా, నరసింహపురం బంజరలో ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోడూరులో పిడుగుపాటుకు దాసరి అజయ్ (24)తో పాటు రెండు పశువులు మృతి చెందాయి. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్, దేవరుప్పులలో పిడుగులు పడి రెండు పశువులు మృతి చెందాయి. చిన్నగూడురు మండలంలో రాళ్ల వాన పడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వాన పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తిలో పిడుగుపాటుకు వ్యక్తి చనిపోయాడు. ఒక బర్రె మృతి చెందింది. గుండాల మండలం తుర్కలషాపురం ఒక బర్రె, వలిగొండ మండలం వెంకటాపురంలో ఒక ఆవు, సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జలో రెండు ఆవులు, ఆత్మకూర్ (ఎం) మండలం పారుపల్లిలో ఒక ఎద్దు, నల్లగొండ జిల్లా చండూరు మండలం ఉడుతపల్లిలో ఆవు పిడుగుపాటుకు మృతిచెందాయి. వర్షంతోపాటు వాతావరణం చల్లబడగా ఎండ వేడిమి నుంచి జనం ఉపశమనం పొందారు.

### పెరుగుతున్న వడదెబ్బ మృతులు

రాష్ట్రంలో వారం నుంచి భానుడి భగభగలకు తాళలేక రైతులు, దినసరి కూలీలు, వృద్ధులు అసువులు బాస్తున్నారు. శనివారం వివిధ జిల్లాల్లో ఏకంగా 19 మంది వడదెబ్బ సోకి మృతిచెందారు. ముఖ్యంగా జగిత్యాల, కరీంనగర్ జిల్లాలు ఉడికిపోయాయి. వివిధ జిల్లాల్లో ఆదివారం కూడా 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో అత్యధికంగా 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిగిత్యాల జిల్లా గోదూరులో 46.8, అల్లీపూర్‌లో 46.7, కరీంనగర్ జిల్లా వీణవంక 46.7, నిర్మల్ జిల్లా బుట్టాపూర్‌లో 46.5, మంచిర్యాల జిల్లా జెన్నారం 46.3, హాజీపూర్ 46.3, వెల్లనూర్ 46.2, నిజామాబాద్ నార్త్ 46.2, కాగజ్‌నగర్‌లో 46.1 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

### పడిపోతున్న తేమశాతం

రాష్ట్రంలో తేమ శాతం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీని వల్ల వాతావరణం పొడిబారి ఉష్ణతాపానికి దారితీస్తున్నది. వాతావరణం చల్లగా ఉండాలంటే గాలిలో తేమ శాతం సమంగా ఉండాలి. కనీసం 50 శాతం ఉన్నా వేడి తీవ్రత అంతగా ఉండదు.

### ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నల్లగొండ | 46.7°c | 36.5°c |
| ఆదిలాబాద్ | 46.3°c | 26.7°c |
| మెదక్ | 45.1°c | 23.6°c |
| రంగారెడ్డి | 44.7°c | 23.0°c |
| నిజామాబాద్ | 44.6°c | 27.1°c |
| ఖమ్మం | 44.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 43.4°c | 31.0°c |
| హైదరాబాద్ | 42.8°c | 29.3°c |
| కరీంనగర్ | 42.0°c | 28.0°c |
| వరంగల్ | 42.0°c | 28.0°c |

### 32వేల పోస్టల్ ఓట్లు పోల్

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో శనివారం రాత్రి వరకు 32,331 పోస్టల్ బ్యాలెట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమ్ ఓటర్ క్యాటగిరీలో మొత్తం 23,247 ఓట్లు ఉండగా 15,637 ఓట్లు పోల్ అయినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న, సైన్యంలో పనిచేస్తున్న ఉద్యోగులు కలుపుకొని మొత్తం రెండు లక్షల పోస్టల్ బ్యాలెట్లు జారీచేయగా, అందులో ఇప్పటివరకు 32,331ఓట్లు పోలైనట్టు వెల్లడించారు. వృద్ధులు, ఓటు వేసేందుకు వెళ్లలేనివారికి సంబంధించి ఎన్నికల సిబ్బంది వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఓట్లను సేకరిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్లు, హోమ్ ఓటర్లకు ఓటు వేసేందుకు ఈనెల 8తుది గడువు.

### 8, 10 తేదీల్లో రాష్ట్రంలో మోదీ పర్యటన

**9, 11 తేదీల్లో అమిత్‌షా రాక**

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ఈ నెల 8, 10వ తేదీల్లో రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. నాలుగుచోట్ల జరిగే ఎన్నికల సభల్లో పాల్గొననున్నారు. 8న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, వరంగల్, 10న మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగసభల్లో పాల్గొననున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 9న వికారాబాద్‌లో, 11న భువనగిరి సభల్లో పాల్గొననున్నారు.

### జూన్ 20న యూహెచ్‌క్యూ అగ్నివీర్ ర్యాలీ

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెల 20న యూనిట్ హెడ్ క్వార్టర్స్ కోటా (యూహెచ్‌సీ) కింద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని సికింద్రాబాద్‌లోని -1 ఈఎంఈ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు భారత రక్షణశాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. మరిన్ని వివరాల కోసం awwaleagle@gmail.comకు మెయిల్ చేయాలని, www.joinindianarmy@nic.in పోర్టల్‌ను సందర్శించాలని, 040-27863016కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించింది.

### టీహబ్‌లో ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): ఫిన్‌టెక్ రంగంలో స్టార్టప్‌లను టీహబ్ ప్రోత్సహిస్తున్నది. ఇంటర్నేషనల్ ఫైనాన్సియల్ సర్వీసెస్ సెంటర్ అథారిటీ భాగస్వామ్యంతో ఫైనాన్సియల్ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏవిధంగా వినియోగించవచ్చన్న అంశంపై ఫిన్‌టెక్ యాక్సిలరేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు టీహబ్‌ను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు https://bit.ly/49WCfzO ఈ లింకును చూడాలని సూచించారు.

# ఓయూలో నీటి కొరత, కరెంట్ కోత నిజమే

- **సీఎం రేవంత్ సమక్షంలో పార్టీ ఎంపీ అభ్యర్థి దానం అంగీకారం**
- **అభ్యంతరం తెలపని ముఖ్యమంత్రి**
- **సర్కారు దాచినా దాగని ఓయూ నిజం**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): వందేండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో నీటి కొరత, కరెంట్ కోతలు నిజమనే విషయం మరోసారి రుజువైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలోనే సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ఉస్మానియా యూనివర్సిటీలో నీటి కొరత, కరెంట్ కోతలు ఉన్నది నిజమేనని స్పష్టంచేశారు. దానిని పరిష్కరించాల్సి ఉన్నదని చెప్పారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్ షోలో ప్రజల సాక్షిగా దానం ఈ వ్యాఖ్యలు చేశారు. పక్కనే ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యల పట్ల ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అంటే ప్రభుత్వం కావాలనే ఓయూ ఘటనను దాచిపెట్టిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా ఓయూ ఘటనను మరోసారి ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఓయూ పోలీసుల కస్టడీలో బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 5: ఉస్మానియా యూనివర్సిటీ సెలవులకు సంబంధించిన నకిలీ సర్క్యులర్‌ను తయారుచేశారనే అభియోగంతో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను ఓయూ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. నిజానిజాలు నిర్ధారించేందుకు నిందితుడిని రెండు రోజుల కస్టడీకి ఇవ్వాలని 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేయగా, ఒక రోజు కస్టడీకి న్యాయస్థానం అంగీకరించింది. ఈ నేపథ్యంలో చంచల్‌గూడ జైళ్లో ఉన్న ఆయనను ఆదివారం ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం వరకు ఆయన పోలీసుల కస్టడీలో ఉండనున్నారు. క్రిశాంక్ సెల్‌ఫోన్ మిస్సింగ్, కాల్ డేటా, వాట్సాప్ మెసేజ్‌లపై పోలీసులు ఆరా తీసినట్టు సమాచారం.

### నాడు దాచేందుకు ఆపసోపాలు


వారం రోజుల క్రితం ఓయూలో ఉన్న నీటి కొరత, కరెంట్ కోతల కారణంగా నెల రోజుల పాటు సెలవులు ప్రకటిస్తూ చీఫ్ వార్డెన్ నోటీసు ఇచ్చారు. ఈ విషయాన్ని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎక్స్ వేదికగా ఎండగట్టారు. 'తాగునీటి కొరతలేదు.. కరెంట్ కోతలు లేవు.. అని బుకాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఈనోటీసుకు ఏం సమాధానం చెప్తుంది?' అని నిలదీశారు. నెటిజన్లు సైతం పెద్ద ఎత్తున స్పందించారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. దిద్దుబాటు చర్యలకు దిగిన రాష్ట్ర సర్కారు.. హడావుడిగా విద్యుత్తు, జలమండలి అధికారులతో వేర్వేరుగా ప్రకటనలు ఇప్పించింది. కరెంట్ కోతలు లేవని, నీటి కొరత లేదని బుకాయించింది. కానీ, నీటికొరత తీర్చాలని లేడీస్ హాస్టల్ విద్యార్థినులు చేసిన ధర్నాలు, ఆందోళనల వార్తలు మీడియాలో రావడంతో సర్కారు నాలుక మడతేసింది. తక్షణమే తాగునీటి సరఫరా చర్యలు చేపడతామని చెప్పింది. ఓయూ ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం స్పందించారు. తక్షణమే చర్యలు చేపడుతున్నట్టు ప్రకటించారు. నీటి కొరత, కరెంట్ కోతల కారణంగా సెలవులు ప్రకటించిన చీఫ్ వార్డెన్‌పై షోకాజ్ నోటీసు జారీచేశారు.

### స్వయంగా స్పందించిన సీఎం

మరోసటి రోజు ఓయూ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి కూడా స్వయంగా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నిరుడు కూడా తాగునీటి కొరత, కరెంట్ కోతల కారణంగా ఓయూలో సెలవులు ఇచ్చారంటూ ఓ నోటీసు పోస్టు చేశారు. వెంటనే స్పందించిన ఓయూ విద్యార్థి నాయకుడు సీఎం చేసిన నోటీసు ఫేక్ అని, ఇదిగో ఇదే నిజం అని మరో నోటీసు పోస్టు చేశారు. ఏది నిజమైన నోటీసు, ఏదీ ఫేక్ నోటీసు అనేది తేల్చకుండానే ఓయూ అధికారులు, విద్యార్థి నాయకుడితో పాటు బీఆర్‌ఎస్ నేత క్రిశాంత్‌పై తప్పుడు నోటీసు సోషల్‌మీడియాలో పోస్టుచేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఓయూ నేతతో పాటు క్రిశాంక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఇంత తతంగం జరిగి రాష్ట్రస్థాయిలో వివాదాస్పదమైన ఉస్మానియా యూనివర్సిటీ నీటి కొరత, కరెంట్ కోతల ఘటనను కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ సీఎం సమక్షంలోనే అంగీకరించడం సంచలనంగా మారింది. ఓయూలో నీటి కొరత, కరెంట్ కోతలు నిజమేనని, ప్రభుత్వమే కావాలని దానిని దాస్తుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

# చెరువుల పునరుద్ధరణలో తెలంగాణ భేష్

- **తమిళ నాడు 50 ఏండ్లలో చేసిన ఖర్చు తెలంగాణ పదేండ్లలోనే చేసింది**
- **తమిళ నాడు జియోగ్రఫీ నిపుణుల కితాబు**
- **'ద్రవిడియన్ ఇన్‌సైట్స్' ప్రకటనను ఖండించి తెలంగాణ కృషికి జేజేలు**
- **అపరభగీరథుడు కేసీఆర్ తెచ్చిన 'మిషన్ కాకతీయ' ఫలం**
- **నాడు చెరువుల బలోపేతమే ఉద్యమ నినాదం**
- **పథకంతో పదేండ్లుగా అద్భుత ఫలితాలు**
- **గణనీయంగా పెరిగిన భూగర్భ జలాలు**
- **పచ్చని శోభను సంతరించుకున్న పల్లెలు**



హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : తెలంగాణకు జీవనాధారమైన చెరువుల బలోపేతానికి ఉద్యమనేత, స్వరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెచ్చిన 'మిషన్ భగీరథ' చేసిన అద్భుతాలపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో చెరువుల పునరుద్ధరణకు ఇప్పటికే ఎన్నో సంస్థలు కితాబునివ్వగా, తాజాగా తమిళనాడు జియోగ్రఫీ నిపుణులు కూడా కొనియాడారు. 'చెరువుల పునరుద్ధరణలో తెలంగాణే భేష్' అని చాటిచెప్పారు. దేశంలో అత్యధిక చెరువులు కలిగిన రాష్ట్రంగా తెలంగాణే నిలిచిందని స్పష్టం చేశారు. దేశంలో నీటి వనరుల పరిస్థితి ఏమిటి? ఏ రాష్ట్రంలో నీటి వనరులు ఎక్కువ ఉన్నాయి? తదితర అంశాలపై కేంద్ర జల్‌శక్తి శాఖ అధ్యయనం చేసి నిరుడు నివేదిక విడుదల చేసింది. ఇందులోని గణాంకాలను ఆధారంగా చేసుకొని దేశంలోనే అత్యధిక నీటి వనరులున్న రాష్ట్రం తమిళనాడు అని పేర్కొంటూ ద్రవిడియన్ ఇన్‌సైట్స్ సంస్థ ఎక్స్ వేదికగా నిరుడు ప్రకటించింది. తాజాగా ఈ ప్రకటనను తమిళనాడు జియోగ్రఫీ నిపుణులు ఖండించారు. దేశంలోనే అత్యధిక చెరువులు కలిగి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తున్నదని, ఎందుకంటే ఆ రాష్ట్రం చెరువులను ట్యాంక్‌లుగా వర్గీకరించిందని, తమిళనాడు లేక్స్‌గా పిలుస్తున్నదని వివరించారు. నీటి వనరుల పునరుద్ధరణ కోసం తమిళనాడు 50 ఏండ్లలో చేసిన ఖర్చును తెలంగాణ కేవలం పదేండ్లలోనే చేసి అనేక చెరువులను బాగుచేసిందని కొనియాడారు.

### అపరభగీరథుడి అద్భుత కృషి ఫలితం

ఉమ్మడి రాష్ట్రంలో వలస పాలకుల కుట్రలతో తెలంగాణ ప్రాంతానికి జీవనాడి అయిన గొలుసుకట్టు చెరువులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. పూడిక చేరి, కట్టలు కరిగి, నిల్వ నీరు లేకుండా బోసిపోయాయి. తెలంగాణ పల్లె బతుకు ఛిద్రమై పల్లె జీవనం పట్నాలకు వలస కట్టింది. 'మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల'కే పెద్దపీట వేసి తెలంగాణలో ఉన్న చెరువులను 'మైనర్ ఇరిగేషన్' కింద చూపుతూ ఈ ప్రాంతానికి ఆయువుపట్టు లాంటి తటాకాలను వట్టిపోయేలా చేసిన కుట్రలను గుర్తించిన కేసీఆర్, చెరువుల పునరుద్ధరణ అంశాన్నే ఉద్యమ నినాదంగా చేసుకున్నారు. తెలంగాణ ప్రాంత చెరువులు ఎలా నిర్లక్ష్యానికి గురయ్యాయో అనేకసార్లు ప్రజలకు వివరించారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తొలి ప్రాధాన్యతగా చెరువుల పునరుద్ధరణపై దృష్టి పెట్టారు. రాష్ట్రంలో మొత్తం 46,531 చెరువులున్నట్టు లెక్క తేల్చారు. వీటి కింద 24.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని నిర్ధారించి ఏటా 20శాతం పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2015 మార్చి 12న నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ పాత చెరువు వద్ద కేసీఆర్ స్వయంగా 'మిషన్ కాకతీయ'కు శ్రీకారం చుట్టారు. నాలుగు దశల్లో రూ.9,155 కోట్లతో 27,627 చెరువులను పునరుద్ధరించారు. ఐదో దశలోనూ మిగిలిన చెరువుల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. చెరువులకు శాశ్వత జలకళను తెచ్చేందుకు ప్రాజెక్టులతో అనుసంధానించారు. మొత్తంగా ప్రాజెక్టు కమాండ్ ఏరియాలోని 20 వేలకు పైగా చెరువులను ప్రాజెక్టులతో లింక్ చేయాలని లక్ష్యం పెట్టుకొని 10వేల చెరువులకు పైగా అనుసంధానం చేసి నదీజలాలతో నింపారు. పదేండులగా మిషన్ కాకతీయ పథకం ఫలితాలు కండ్లెదుట కనిపిస్తున్నాయి. ఆయా చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగింది. గ్రామాల్లో భూగర్భ జలాలు పైపైకి వచ్చాయి. మత్స్య పరిశ్రమ గణనీయ వృద్ధి సాధించింది. జీవాలు, పాడిపశువులకు నీటి కొరత తీరిపోయింది. పూడిక మట్టిని పొలాలకు తరలించడంతో దిగుబడి గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని అనేక పరిశోధనలు నిగ్గుతేల్చాయి. నీటి వనరుల వృద్ధితో తెలంగాణ క్రమంగా పూర్వవైభవాన్ని సంతరించుకుంది. పల్లెలు పచ్చదనాన్ని పులుముకున్నాయి. ఏటికేడు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కూడా పెరుగుతున్నది. ఒక్కమాటలో చెప్పాలంటే మిషన్ కాకతీయ పథకం పల్లెకు జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఊతమిచ్చింది. పథకం ఫలితాలపై యావత్ దేశమే ప్రశంసలు కురిపించింది. అనేక రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకున్నాయి.

### పెరిగిన భూగర్భ జలమట్టం

*(భూగర్భ జలాల వృద్ధిలో 89.5శాతంతో దేశంలోనే తెలంగాణ టాప్‌గా నిలచింది) మీటర్లు (భూమినుంచి లోతులో)*

| | |
|---|---|
| 2016-17 | 10.74 |
| 2017-18 | 10.40 |
| 2018-19 | 11.82 |
| 2019-20 | 10.38 |
| 2020-21 | 7.32 |
| 2021-22 | 4.38 |

### మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ వివరాలు

| దశలు | చెరువులు | ఆయకట్టు లక్షల ఎకరాల్లో |
|---|---|---|
| ఫేజ్ 1 | 7,959 | 6.92 |
| ఫేజ్ 2 | 8,911 | 6.87 |
| ఫేజ్ 3 | 6,085 | 4.10 |
| ఫేజ్ 4 | 4,672 | 3.32 |
| మొత్తం | 27,627 | 21.21 |